డబుల్ ధమాకా

అర శాతం తగ్గిన రెపో రేటు • 50 బేసిస్ పాయింట్లు దిగి 5.50 శాతానికి చేరిక

ద్వైమాసిక ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ నిర్ణయం • గృహ, వాహన తదితర రుణాలు చౌక

దిగిరానున్న ఈఎంఐల భారం • ఆటో, నిర్మాణ రంగాల్లో ఉత్సాహం

• దేశ ఆర్థిక వ్యవస్థకూ జోష్ అంటున్న నిపుణులు • సీఆర్ఆర్ కోతతో బ్యాంకులకు రూ.2.5 లక్షల కోట్లు

ఆర్బీఐ జంబో రేట్ కట్‌కు జై కొట్టింది. అంచనాలను మించి ఒకేసారి రెపో రేటుకు 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. గడిచిన ఐదేండ్లలో ఈ స్థాయిలో తగ్గించడం ఇదే తొలిసారి. అంతకుముందు రెండు ద్రవ్యసమీక్షల్లో 25 బేసిస్ పాయింట్ల చొప్పున రెపో రేటును దించడంతో మొత్తంగా ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా 1 శాతం తగ్గినట్టైంది. దీంతో గృహ, వాహన తదితర రుణగ్రహీతలకు భారీ ఊరటే దక్కనున్నది. ఈఎంఐల భారం దిగిరానున్నది మరి.

ముంబై, జూన్ 6: ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా మునుపు కఠిన ద్రవ్య వైఖరిని అవలంభించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. ప్రస్తుతం దేశ ఆర్థిక వృద్ధిరేటు బలోపేతమే ధ్యేయంగా ముందుకెళ్తున్నది. కొత్తగా ఆర్బీఐ గవర్నర్‌గా వచ్చిన సంజయ్ మల్హోత్రా.. ఈ ఏడాది మొదలు వడ్డీరేట్ల కోతలే ప్రధానంగా ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలు జరుపుతూ వస్తున్నారు మరి. ఈ క్రమంలోనే ఫిబ్రవరి, ఏప్రిల్ ద్రవ్యసమీక్షల్లో 25 బేసిస్ పాయింట్ల (పావు శాతం) చొప్పున రెపో రేటును తగ్గించిన ఆర్బీఐ.. తాజా ద్రవ్యసమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు (అర శాతం) దించేసింది. దీంతో రెపో రేటు 5.50 శాతానికి తగ్గింది. 6 నెలల్లో రెపో రేటు 1 శాతం తగ్గడం విశేషం. బుధవారం మొదలైన జూన్ ద్వైమాసిక ద్రవ్యసమీక్ష శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ)లో గల ఆరుగురు సభ్యుల్లో మెజారిటీ సభ్యులు రెపో రేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించాల్సిందేనని నిర్ణయించారు. ఈ మేరకు ద్రవ్యసమీక్ష అనంతరం ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా విలేకరుల సమావేశంలో ప్రకటించారు. కాగా, ఈ ఏప్రిల్‌లో దాదాపు 6 ఏండ్ల కనిష్ఠాన్ని తాకుతూ రిటైల్ ద్రవ్యోల్బణం 3.16 శాతంగా నమోదు కావడం కూడా ఆర్బీఐ జంబో రేట్ కట్‌కు దోహదం చేసింది.

రుణగ్రహీతలకు ఊరట

రెపో రేటు తగ్గింపుతో రుణగ్రహీతలకు భారీ ఊరటే దక్కబోతున్నది. బ్యాంకులు తమ రుణాలపై ఈ మేరకు వడ్డీరేట్లను తగ్గించనున్నాయి. ఇది కొత్త రుణాల లభ్యతను పెంచనుండగా, ఇప్పటికే రుణాలు తీసుకున్న వారిపై ఈఎంఐ (నెలవారీ కిస్తీలు) భారాన్ని దించనున్నది. ప్రధానంగా గృహ, ఆటో, వ్యక్తిగత రుణాలకు గిరాకీ ఏర్పడుతుందని మార్కెట్ వర్గాలు, బ్యాంకింగ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిజానికి ప్రస్తుతం బ్యాంక్ రుణాల వృద్ధి 9.8 శాతానికి పడిపోయింది. అయితే ఆర్బీఐ తాజా నిర్ణయంతో ఇది మళ్లీ పెరిగే వీలున్నది.

బ్యాంకులకు సీఆర్ఆర్ కిక్కు

బ్యాంకుల చేతికి మరింత నగదును అందించేలా సీఆర్ఆర్‌ను 100 బేసిస్ పాయింట్లు తగ్గించింది ఆర్బీఐ. దీంతో ఈ ఏడాది డిసెంబర్‌కల్లా రూ.2.5 లక్షల కోట్లు అదనంగా బ్యాంకింగ్ వ్యవస్థలోకి రానున్నాయి. వ్యవస్థలో నగదు చలామణిని, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి సెంట్రల్ బ్యాంకులు వినియోగించే ద్రవ్య విధాన సాధనమే ఈ నగదు నిల్వల నిష్పత్తి లేదా సీఆర్ఆర్ (క్యాష్ రిజర్వ్ రేషియో). ఇందులో భాగంగానే బ్యాంకులు ఆర్బీఐ వద్ద నిర్ణీత స్థాయిలో తమ డిపాజిట్లను పెట్టాల్సి ఉంటుంది. సీఆర్ఆర్‌ను పెంచితే బ్యాంకులు ఆర్బీఐ వద్ద మరింతగా డిపాజిట్లను పెట్టాలి. అప్పుడు వాటి దగ్గర ద్రవ్య నిల్వలు పడిపోతాయి. అలాగే సీఆర్ఆర్‌ను తగ్గిస్తే ఆర్బీఐ వద్ద పెట్టిన డిపాజిట్ల నుంచి బ్యాంకుల చేతికి అదనపు నగదు నిల్వలు అందుతాయి. వ్యవస్థలో ద్రవ్యోల్బణం, జీడీపీ వృద్ధిరేటు ఆధారంగా సీఆర్ఆర్‌పై ఆర్బీఐ నిర్ణయం తీసుకుంటుంది. ద్రవ్యోల్బణం పెరిగితే వ్యవస్థలో నగదు చలామణిని తగ్గించడానికి సీఆర్ఆర్‌ను ఆర్బీఐ పెంచుతుంది. అదేవిధంగా వృద్ధిరేటు పురోగతికి నగదు చలామణిని పెంచేందుకు సీఆర్ఆర్‌ను తగ్గిస్తుంది.

ద్రవ్యసమీక్ష ముఖ్యాంశాలు

- ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) దేశ జీడీపీ వృద్ధిరేటు అంచనా యథాతథంగా 6.5 శాతం.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణం 3.7 శాతంగానే ఉండొచ్చని అంచనా. మునుపు ఇది 4 శాతంగా ఉన్నది.
- ఏప్రిల్-జూన్‌లో 2.9%, జూలై-సెప్టెంబర్‌లో 3.4%, అక్టోబర్-డిసెంబర్‌లో 3.9%, జనవరి-మార్చిలో 4.4 శాతంగా ఉండొచ్చని అంచనా.
- రూటు మార్చుకున్న రుతు పవనాల కదలికల్ని నిశితంగా గమనిస్తున్నామన్న ఆర్బీఐ.
- 2025-26లో కరెంట్ ఖాతా లోటు (క్యాడ్) ఆమోదయోగ్య స్థాయిలోనే ఉండొచ్చని అంచనా.
- తదుపరి ద్రవ్యసమీక్ష ఆగస్టు 4-6.

ఆందోళనకరం

తాజా ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగానే ఉన్నదన్న సంకేతాలను ఇస్తుండటం గమనార్హం. ఇటీవల కేంద్ర ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను అధికారికంగా విడుదల చేసిన జీడీపీ గణాంకాల్లో దేశ ఆర్థిక వృద్ధిరేటు నాలుగేండ్ల కనిష్ఠానికి పతనమైనట్టు తేలిన విషయం తెలిసిందే. ఈసారి 6.5 శాతంగానే నమోదైంది. 2020-21 తర్వాత ఈ స్థాయిలో జీడీపీ గణాంకాలుండటం ఇదే ప్రథమం. ఈ నేపథ్యంలో దేశీయంగా వినిమయ సామర్థ్యాన్ని పెంచేందుకు, ప్రజల చేతుల్లో మరింత నగదును ఉంచేందుకు అనుగుణంగా ఈ ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ పలు నిర్ణయాలు తీసుకున్నది. ఇందులోభాగంగానే ఏకంగా రెపో రేటును 50 బేసిస్ పాయింట్లు ఆర్బీఐ తగ్గించిందన్న అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయి. కరోనా విజృంభించిన 2020లోనూ రెపో రేటును 75 బేసిస్ పాయింట్లు తగ్గించిన సంగతి విదితమే. రెపో రేటు తగ్గితే బ్యాంక్ రుణాలపై వడ్డీరేట్లు తగ్గి మార్కెట్‌లో నీరసించిన కొనుగోళ్లు తిరిగి ఊపందుకుంటాయన్నదే దీని వెనుకున్న అసలు ఉద్దేశం.



వ్యవస్థలోకి ఫండింగ్

ఆర్బీఐ తీసుకున్న మరో నిర్ణయం కూడా దేశ ఆర్థిక మందగమనాన్ని తేటతెల్లం చేస్తున్నది. సుదీర్ఘ విరామం తర్వాత సీఆర్ఆర్‌ని ఆర్బీఐ ఏకంగా 1 శాతం తగ్గించింది. తాజా ద్రవ్యసమీక్షలో 4 శాతం నుంచి 3 శాతానికి తీసుకొచ్చింది. ఈ నిర్ణయం వల్ల బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.2.5 లక్షల కోట్లు అదనంగా వచ్చి చేరనున్నాయి. దీంతో రుణ లభ్యత మరింత పెరగనున్నది. కరోనా పరిస్థితుల ప్రభావంతో దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపర్చేందుకు 2020 మార్చి 27న కూడా ఇలాగే 100 బేసిస్ పాయింట్ల (1 శాతం) మేర సీఆర్ఆర్‌ను ఆర్బీఐ తగ్గించింది. ఇక ఆయా వస్తూత్పత్తుల కొనుగోళ్లకు, వివిధ రంగాల్లో ఉత్పాదకత పెంపునకు సీఆర్ఆర్ తగ్గింపు దోహదం చేయనున్నది. ఇదే జరిగితే గాడి తప్పిన దేశ ఆర్థిక వ్యవస్థ తిరిగి గాడినపడి.. జీడీపీ వృద్ధిరేటు మళ్లీ పట్టాలెక్కి పరుగులు పెడుతుందన్న ఆశలు అటు ఆర్బీఐ, ఇటు కేంద్ర ప్రభుత్వ వర్గాల్లో కనిపిస్తున్నది.

రికార్డు డివిడెండ్

ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికిగాను మునుపెన్నడూ లేనివిధంగా కేంద్రానికి ఆర్బీఐ డివిడెండ్‌ను అప్పజెప్పడం కూడా దేశ ఆర్థిక విపత్కర పరిస్థితికి అద్దం పడుతున్నదనే చెప్పవచ్చు. 2024-25కుగాను రికార్డు స్థాయిలో రూ.2.69 లక్షల కోట్ల డివిడెండ్‌ను ఆర్బీఐ ఈమధ్యే ప్రకటించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2023-24)తో పోల్చితే ఇది 27 శాతం ఎక్కువ. నాడు 2.11 లక్షల కోట్లు ఖజానాకు చేర్చింది. దేశ ఆర్థిక వ్యవస్థలో మందగమనంతో సర్కారీ ఆదాయం పడిపోతుండటం, ఖర్చులు-రుణ భారం పెరిగిపోతుండటంతో కేంద్ర ప్రభుత్వ సంస్థల డివిడెండ్లే దిక్కవుతున్నది. ఈ క్రమంలోనే ఆర్బీఐ నుంచి వీలున్నంత వరకు కేంద్రం పిండుకుంటున్నదన్న విమర్శలున్నాయి. నిజానికి మోదీ సర్కారు వైఖరి, భారీ డివిడెండ్ల కోర్కెలు నచ్చకనే ఆర్బీఐ మాజీ గవర్నర్లు రాజన్, పటేల్‌లు తప్పుకున్నారన్న వార్తలూ ఉన్నాయి. అయితే వీరి తర్వాత వచ్చిన శక్తికాంత దాస్, ఇప్పుడున్న మల్హోత్రాలు మాత్రం ఆర్బీఐ మిగులు నగదు నిల్వలతో ఖజానాను నింపేస్తున్నారు. కానీ ఆర్బీఐ వద్ద నిధులు ఎక్కువగా ఉంటేనే దేశ ఆర్థిక వ్యవస్థ, బ్యాంకింగ్ వ్యవస్థ బాగుంటుందని, డివిడెండ్లు ఈ లక్ష్యాలకు గండి కొడుతున్నాయన్న ఆందోళనలు ఆర్థిక నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

ఎవరేమన్నారు?

రెపో రేటు 50 బేసిస్ పాయింట్లు తగ్గుతుందని ఊహించలేదు. రుణాల వృద్ధికి ఇది దోహదం చేయగలదు. ఆర్థిక వ్యవస్థలోని ప్రతీ రంగానికి ఆర్బీఐ నిర్ణయం కలిసొచ్చేదే.

-సీఎస్ శెట్టి, ఎస్బీఐ చైర్మన్

ఆర్బీఐ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. దేశీయ మార్కెట్‌లో స్థిరాస్తి అమ్మకాలకు ఇది కలిసొస్తుంది.

-శేఖర్ జీ పటేల్, క్రెడాయ్ అధ్యక్షుడు

బ్యాంకులు ఈ ప్రయోజనాన్ని రుణగ్రహీతలకు అందించాలి. మధ్యతరగతి ఆదాయ వర్గాలకు గొప్ప ఊరట.

-జీ హరిబాబు, నరెడ్కో అధ్యక్షుడు

రెపో రేటును అర శాతం తగ్గించడం.. వృద్ధికి ఊతమిచ్చే నిర్ణయమే.

-హర్ష వర్ధన్, ఫిక్కీ అధ్యక్షుడు

ఆటో రంగానికి ఇది నిజంగా ప్రోత్సాహకరం. రెపో, సీఆర్ఆర్ తగ్గింపులు వృద్ధిదాయకం.

-సియాయ్, ఏసీఎంఏ

దేశ వృద్ధిరేటు మరింతగా బలహీనపడిందని పిస్తే రాబోయే ద్రవ్యసమీక్షల్లోనూ వడ్డీరేట్ల కోతలుండే వీలున్నది.

-రాధికా రావు, డీబీఎస్ బ్యాంక్ ఆర్థికవేత్త

వడ్డీరేట్లు తగ్గించిన పీఎన్‌బీ

నూఢిల్లీ, జూన్ 6: పీఎన్‌బీ వడ్డీరేట్లను అర శాతం తగ్గించింది. రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించిన కొన్ని గంటల్లోనే రెపోతో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేటును 50 బేసిస్ పాయింట్లు కోత విధించింది. తగ్గించిన వడ్డీరేట్లు ఈ నెల 9 నుంచి అమలులోకి రానున్నట్లు పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో పాత, కొత్తగా తీసుకునే రుణగ్రహీతలకు ఆర్థిక ప్రయోజనాలు లభించనున్నాయి.

ఇక వడ్డీరేట్ల కోతలకు బ్రేక్?

తాజా ద్రవ్యసమీక్షలో ఒకేసారి అర శాతం రెపో రేటును తగ్గించిన ఆర్బీఐ.. ఇక ఈ కోతలకు బ్రేక్ వేయనుందా? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంకేతాలే ఇందుకు నిదర్శనం. భవిష్యత్తులో వడ్డీరేట్ల తగ్గింపులు, పెంపులు.. వృద్ధిరేటు, ద్రవ్యోల్బణంపైనే ఆధారపడి ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఆర్బీఐ తమ పాలసీ వైఖరిని ఎకామ్డేటివ్ నుంచి న్యూట్రల్‌కు మార్చుకుంటున్నట్టు ప్రకటించింది మరి. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్ల కోతలు తప్పక ఉంటాయని అంచనా వేయలేని పరిస్థితి. ఇప్పటిదాకా ఎకామ్డేటివ్ మానిటరీ పాలసీని ఆర్బీఐ పాటించింది. దీంతో వడ్డీరేట్లు తగ్గుతూ వచ్చాయి. కాగా, ఆర్బీఐ ప్రధానంగా మూడు ద్రవ్య విధాన వైఖరిలను ప్రదర్శిస్తుంది. అందులో హాకిష్ పాలసీ ఒకటైతే, మరొకటి డోవిష్ పాలసీ. ఇంకొకటే న్యూట్రల్ పాలసీ. హాకిష్ పాలసీలో ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా వడ్డీరేట్లను అధిక స్థాయిల్లోనే ఉంచుతుంది. వడ్డీరేట్లను పెంచడం తప్ప తగ్గించదు. ఇక డోవిష్ పాలసీ (ఎకామ్డేటివ్)లో జీడీపీ వృద్ధికి పెద్ద పీట వేస్తుంది. మార్కెట్‌లో ద్రవ్య సరఫరా పెరిగేలా, రుణ లభ్యతను పెంచేలా వడ్డీరేట్లను స్థిరంగా లేదా తగ్గిస్తూ ఉంటుంది. న్యూట్రల్ పాలసీలో ద్రవ్యోల్బణం, జీడీపీ డాటాల ఆధారంగా వడ్డీరేట్లను ఆర్బీఐ పెంచడం లేదా తగ్గించడం చేస్తుంది.

ఇదిలావుంటే దేశ వృద్ధిరేటు పురోగతికి తమ వంతుగా చేయాల్సింది చేశామని, ఇక మిగతావాళ్లు చేయాలని మల్హోత్రా అన్నారు. బ్యాంకులు రెపో తగ్గింపు ప్రయోజనాన్ని రుణగ్రహీతలకు అందజేయాలంటూ పరోక్షంగా రుణాలపై వడ్డీరేట్ల తగ్గింపునకు పిలుపునిచ్చారు. ఇక భారత్-పాక్ ఉద్రిక్తతల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై చాలా స్వల్పమన్నారు. కాగా, క్రిప్టో కరెన్సీలపై ఒకింత ఆందోళన వ్యక్తం చేశారు.

రెపో రేటు అంటే?

స్వల్పకాలిక నిధుల అవసరాలను తీర్చుకొనేందుకు ఆర్బీఐ వద్ద వాణిజ్య బ్యాంకులు తీసుకున్న రుణాలకు బ్యాంకర్లు చెల్లించే వడ్డీరేటు.

రివర్స్ రెపో రేటు?

కమర్షియల్ బ్యాంకుల నుంచి ఆర్బీఐ తీసుకున్న నిధులపై బ్యాంకర్లకు ఆర్బీఐ చెల్లించే వడ్డీరేటు.

గోల్డ్ లోన్ ఎల్‌టీవీ రేషియో పెంపు



బంగారం తాకట్టుపై రుణాలకు సంబంధించి లోన్-టు-వాల్యూ (ఎల్‌టీవీ) రేషియోను ఆర్బీఐ పెంచింది. రుణం రూ.2.5 లక్షలలోపుంటే.. తనఖా పెట్టిన బంగారం విలువలో 85 శాతం వరకు అప్పు తీసుకోవచ్చు. ప్రస్తుతం ఇది 75 శాతమే. అలాగే రూ.2.5 లక్షలు-రూ.5 లక్షల మధ్య రుణగ్రహీతలకు 80 శాతంగా ఎల్‌టీవీ నిష్పత్తిని నిర్ణయించింది. రూ.5 లక్షలకుపైగా గోల్డ్ లోన్లు తీసుకునేవారికి ఎల్‌టీవీ 75 శాతంగా వర్తిస్తుంది. దీంతో ఇంతకుముందు ఆర్బీఐ గోల్డ్ లోన్లకు సంబంధించి చేసిన ప్రకటనలకు స్పష్టత ఇచ్చినట్టైంది. కాగా, ఎల్‌టీవీ రేషియో.. రుణం తీసుకునే రోజు తనఖా కోసం తెచ్చిన బంగారం విలువపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు తులం బంగారం తనఖా పెట్టి రుణం తీసుకోవాలనుకున్నారు. ఆ రోజు మీ బంగారం విలువను రూ.80,000గా తేల్చారు. దీని ప్రకారం మీకు గరిష్ఠంగా రూ.68,000 రుణం (రూ.80,000లలో 85 శాతం)గా వస్తుంది. ఒకవేళ బుల్లెట్ రీపేమెంట్ రుణాలైతే.. ఎల్‌టీవీ లెక్కింపు మెచ్యూరిటీ సమయంలో చెల్లించే మొత్తంపై ఆధారపడి ఉంటుంది.

- తనఖా బంగారం యాజమాన్య హక్కులకు సంబంధించి ఏదైనా సందేహలుంటే రుణాన్ని పొడిగించవద్దని కూడా ఆర్బీఐ చెప్పింది. ఈ క్రమంలోనే రుణగ్రహీత నుంచి తనఖా కోసం తెచ్చిన బంగారం ధ్రువపత్రాలను బ్యాంకర్లు, ఇతర రుణదాతలు తీసుకోవాలన్నది.
- ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ యూనిట్లు లేదా మ్యూచువల్ ఫండ్స్ యూనిట్ల తనఖాపై అడ్వాన్స్‌లు, రుణాలు ఇవ్వరాదు.
- కిలోకు మించి బంగారం నగలు తాకట్టు పెట్టుకొని రుణాలు మంజూరు చేయరాదు. వెండి ఆభరణాలైతే ఈ పరిమితి 10 కిలోలు. బంగారు నాణేలైతే 50 గ్రాములు మించరాదు. వెండి నాణేల తాకట్టుకు పరిమితి 500 గ్రాములు.
- తనఖా పెట్టిన బంగారం లేదా వెండిని వాస్తవిక ప్యూరిటీ (క్యారెట్స్) ఆధారిత ధరల ప్రకారమే తీసుకోవాలి.

కదంతొక్కిన సూచీలు

సెన్సెక్స్ 746, నిఫ్టీ 252 పాయింట్ల లాభం

ముంబై, జూన్ 6: దేశీయ స్టాక్ మార్కెట్లు కదంతొక్కాయి. వరుసగా మూడోసారి వడ్డీరేట్లను అరశాతం తగ్గిస్తూ రిజర్వుబ్యాంక్ తీసుకున్న నిర్ణయం మదుపరుల్లో జోష్ పెంచింది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టే అవకాశం ఉండటం, అలాగే మార్కెట్లో ద్రవ్యలభ్యతను పెంచడానికి నగదు నిల్వల నిష్పత్తిని 100 బేసిస్ పాయింట్లు తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం కూడా కొనుగోళ్లవైపు నడిపించాయి. తీవ్ర ఊగిసలాటల మధ్య ప్రారంభమైన సూచీలు ఆర్బీఐ నిర్ణయంతో ఇరు సూచీలు ఒక్క శాతానికి పైగా పెరిగాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మళ్లీ 82 వేల పాయింట్ల మైలురాయిని అధిగమించినట్టు అయింది. ఇంట్రాడేలో 900 పాయింట్ల వరకు లాభపడిన సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 746.95 పాయింట్లు లాభపడి 82,188.99 పాయింట్ల వద్ద ముగిసింది. సూచీల్లో 2,278 షేర్లు లాభపడగా, 1,744 సూచీలు నష్టపోయాయి. 134 షేర్లు యథాతథంగా ఉన్నాయి.

మళ్లీ 25 వేల పైకి నిఫ్టీ

మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ తిరిగి 25 వేల మైలురాయిని అధిగమించింది. మార్కెట్ ముగిసే సమయానికి 252.15 పాయింట్లు లేదా 1.02 శాతం పెరిగిన నిఫ్టీ చివరకు 25,003 వద్ద ముగిసింది.

బ్యాంకింగ్, వాహన రంగ షేర్లలో జోష్

అందరి అంచనాలకు అనుగుణంగా రిజర్వు బ్యాంక్ కీలక వడ్డీరేట్లను అర శాతం తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం వడ్డీరేట్లకు సంబంధించిన షేర్లలో జోష్ పెంచింది. వాహన, గృహ, ఇతర వ్యక్తిగత రుణాలపై ఈఎంఐల భారం తగ్గనున్నది. రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన షేర్లు ఏడు శాతం వరకు లాభపడ్డాయి. వీటిలో గోద్రెజ్ ప్రాపర్టీస్ 6.75 శాతం, డీఎల్ఎఫ్ 6.61 శాతం, ఒబెరాయ్ రియల్టీ 6.41 శాతం, ప్రెస్టేజ్ ఎస్టేట్ ప్రాజెక్ట్ 5 శాతం, శోభ 4.72 శాతం, మాక్రోటెక్ డెవలపర్స్ 3.68 శాతం, సిగ్నేచర్ గ్లోబల్ ఇండియా 3.02 శాతం, ఫోనిక్స్ మిల్స్ 2.31 శాతం, అనంత్ రాజ్ 1.20 శాతం, బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ 1.19 శాతం చొప్పున పెరిగాయి.

- బజాజ్ ఫైనాన్స్ షేరు 4.93 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- దీంతోపాటు యాక్సిస్ బ్యాంక్ 3.15 శాతం, మారుతి 2.77 శాతం, ఇండస్ ఇండ్ బ్యాంక్ 2.50 శాతం, బజాజ్‌ఫిన్ సర్వ్ 2.36 శాతం, ఎటర్నల్ 2.10 శాతం, మహీంద్రా 2.02 శాతం, టాటా స్టీల్ 2.01 శాతం అధికమయ్యాయి.
- అలాగే టైటాన్, కొటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్ షేర్లు ఒక్క శాతంకు పైగా పెరిగాయి.
- ఎస్బీఐ, నెస్లె, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్, హెచ్‌యూఎల్, టీసీఎస్, ఐటీసీ, ఎల్అండ్‌టీ, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టాటా మోటార్స్, ఏషియన్ పెయింట్స్, రిలయన్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా షేర్లు మాత్రం నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే రియల్టీ 4.74 శాతం, ఆర్థిక సేవలు 1.79 శాతం, మెటల్ 1.56 శాతం, ఆటో 1.50 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్ 1.38 శాతం చొప్పున పెరిగాయి.

కరిగిపోయిన విదేశీ నిల్వలు

ముంబై, జూన్ 6: గత కొన్ని వారాలుగా పెరుగుతూ వచ్చిన విదేశీ మారకం నిల్వలు మళ్లీ కరిగిపోయాయి. మే 30తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 1.237 బిలియన్ డాలర్లు తరిగిపోయి 691.485 బిలియన్ డాలర్లకు తగ్గాయని రిజర్వుబ్యాంక్ తాజాగా వెల్లడించింది. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 1.952 మిలియన్ డాలర్లు తగ్గి 584.215 బిలియన్ డాలర్లకు తగ్గాయని పేర్కొంది. అలాగే పసిడి రిజర్వులు 723 మిలియన్ డాలర్లు ఎగబాకి 84.305 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని తెలిపింది.

ఫీచర్ ఫోన్లలోనూ ఫోన్‌పే సేవలు

న్యూఢిల్లీ, జూన్ 6: ఫీచర్ ఫోన్లలోనూ యూపీఐ పేమెంట్ సేవలు అందించడానికి ఫోన్‌పే..తాజాగా జీఐస్‌పే ఐటీని కొనుగోలు చేసింది. ఈ నూతన టెక్నాలజీతో ఫీచర్ ఫోన్లలోనూ యూపీఐ ఆధారిత పేమెంట్ చెల్లింపులు జరుపుకోవడానికి వీలుంటుంది. వచ్చే త్రైమాసికాల్లో అందుబాటులోకి రానున్న నూతన ఫీచర్ ఫోన్లలో ఈ యూపీఐ పేమెంట్ యాప్‌ను పొందుపరచనున్నట్టు పేర్కొంది.

మస్క్ 'స్టార్ లింక్‌కు' గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, జూన్ 6: దేశంలో శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలు అందించడానికి ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్ లింక్‌కు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ సేవలు ప్రారంభించేందుకు అవసరమైన లైసెన్స్‌ను టెలికాం విభాగం శుక్రవారం జారీ చేసింది. దీంతో ఈ లైసెన్స్ పొందిన మూడో కంపెనీగా స్టార్ లింక్ నిలిచింది. యూటెల్సాట్ వన్‌వెబ్, రిలయన్స్ జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్‌లు ఇప్పటికే లైసెన్స్ పొందాయి. నాలుగో సంస్థ అమెజాన్ క్యూపిర్ అనుమతి కోసం వేచి చూస్తున్నది. స్టార్ లింక్‌కు లైసెన్స్ మంజూరైందని, ఆ సంస్థ దరఖాస్తు చేసుకున్న 15-20 రోజుల్లోనే ట్రయల్ స్పెక్ట్రమ్ మంజూరు చేస్తామని డాట్ వర్గాలు వెల్లడించాయి. ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ అనుబంధ సంస్థ అయిన స్టార్‌లింక్ వివిధ దేశాల్లో ఇంటర్నెట్ సర్వీసులను 2002లోనే ప్రారంభించింది.

శాటిలైట్ టెక్నాలజీతో అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు, బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించడానికి సిద్ధమైంది. సుదూర భూస్థిర ఉపగ్రహాలపై ఆధారపడే సంప్రదాయ ఉపగ్రహ సేవల మాదిరిగా కాకుండా లియో ఉపగ్రహాల ద్వారా స్టార్ లింక్ ఈ సేవలను అందించనున్నది. భూమికి 550 కిలోమీటర్ల ఎత్తులో ఉండే కక్ష్యలో స్టార్ లింక్‌కు చెందిన 6వేల ఉపగ్రహాలు పరిభ్రమిస్తుంటాయి.

మెహుల్ చోక్సీకి సెబీ షాక్

న్యూఢిల్లీ, జూన్ 6: పలు బ్యాంకుల వద్ద వేలాది కోట్ల రూపాయలు తీసుకొని ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన మెహుల్ చోక్సీకి మార్కెట్ నియంత్రణ మండలి సెబీ షాకిచ్చింది. ఆయనకు సంబంధించిన అన్ని రకాల బ్యాంక్ ఖాతాలతోపాటు షేర్లు, మ్యూచువల్ ఫండ్లకు సంబంధించిన ఖాతాలను జప్తు చేసింది. దీంతో ఈ ఖాతాల్లో ఉన్న రూ.2.1 కోట్లను రికవరి చేసింది. జరిమానా విధింపుపై విఫలమైతే ఆస్తులు, బ్యాంక్ ఖాతాలను జప్తు చేయనున్నట్లు గత నెల 15న జారీ చేసిన డిమాండ్ నోటీసుకు అనుగుణంగా సెబీ ఈ నిర్ణయం తీసుకున్నది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ వద్ద రూ.14 వేల కోట్లకు పైగా రుణాలను తీసుకొని ఎగ్గొట్టారు.

గ్రాండ్ విటారాపై ప్రత్యేక స్కీం

న్యూఢిల్లీ, జూన్ 6: కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకీ కీలక నిర్ణయం తీసుకున్నది. పాత మాడల్ నుంచి కొత్త మాడల్‌కు అప్‌గ్రేడ్ అయ్యే కస్టమర్లను ఆకట్టుకోవడానికి ప్రత్యే ఫైనాన్స్ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్కీంతో మధ్యస్థాయి ఎస్‌యూవీ గ్రాండ్ విటారాకు అప్‌గ్రేడ్ అయ్యేవారికి రూ.9,999 ఈఎంఐతో రుణాలు మంజూరు చేస్తున్నది. ప్రస్తుతం స్టాండర్డ్ ఫైనాన్స్ స్కీంల కంటే 20 శాతం తక్కువకే ఈఎంఐని అందిస్తున్నట్టు మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ తెలిపారు. ఐదేండ్లు లేదా 75 వేల కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత ఈ కారును తిరిగి ఇచ్చే అవకాశం కొనుగోలుదారుడికి కల్పించింది. ఈ కారు రిటర్నులో వాహన ధరలో 50 శాతం తిరిగి చెల్లించనున్నది.

హైటెన్షన్ కనెక్షన్లపై బిల్లుల భారం!

- **ల్యాగ్, లీడ్ తో కరెంట్ బిల్లుల మోత**
- **కొత్తవిధానంలో యూనిట్ల లెక్కింపు**
- **పవర్‌ఫ్యాక్టర్ అంటూ నోటీసులు జారీ చేసిన డిస్కం**
- **లబోదిబోమంటున్న వాణిజ్య, పరిశ్రమల యాజమాన్యాలు**

సిటీబ్యూరో, జూన్ 6 (నమస్తే తెలంగాణ): హైటెన్షన్ (హెచ్‌టీ) కనెక్షన్లపై ఎస్పీడీసీఎల్ బిల్లుల భారం మోపడానికి సిద్ధమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో కరెంట్ చార్జిలు పెంచేది లేదంటూ చెప్పిన డిస్కం.. పరోక్షంగా బిల్లుల భారం మోస్తున్నట్లుగా వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా హెచ్‌టీ కనెక్షన్లున్న పరిశ్రమలు, వాణిజ్య సంస్థలపై ఈ భారం పడే అవకాశమున్నట్లుగా తెలుస్తున్నది. వాస్తవ లోడు కన్నా అధిక లోడ్ వాడుతున్నారంటూ అందుకు తగినట్లుగా కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలంటూ ఎస్పీడీసీఎల్ యాజమాన్యం వినియోగదారులకు నోటీసులు జారీ చేస్తున్నది. బిల్లుల మోత లేదంటూనే కొత్త విధానంలో బిల్లులను లెక్కించి ఒక్కో కనెక్షన్‌పై వేలాది రూపాయల భారం మోపడానికి సిద్ధమవుతున్నది.

కొత్తవిధానంలో బిల్లుల లెక్కింపు..!

హెచ్‌టీ కనెక్షన్లు వినియోగిస్తున్న కరెంట్‌ను కిలోవాట్ అవర్(కేడబ్ల్యూహెచ్) విధానంలో ఇన్నాళ్లూ లెక్కించేది. కాగా ఇప్పుడు కొత్త విధానంలో కిలో ఓల్ట్ యాంపియర్ రియాక్టివ్ అవర్(కేవీఏఆర్‌హెచ్) విధానంలో లెక్కిస్తున్నట్లు విద్యుత్ అధికారులు చెప్పారు. కేవీఏఆర్‌హెచ్ విధానంలో ఒక హెచ్‌టీ కనెక్షన్‌రోజూ వినియోగించే కరెంట్ వాస్తవలోడ్ ఎంత అనేది పరిశీలించి ఆ ఓల్టేజ్ ప్రకారం యూనిట్లను లెక్కిస్తారు. దీంతో నెలవారీ బిల్లులు భారీగా పెరగనున్నాయి. అదే కేడబ్ల్యూహెచ్‌లో లెక్కిస్తే ఒక పరిశ్రమ వాస్తవంగా వినియోగించిన కరెంట్ కంటే తక్కువ యూనిట్లకు బిల్లులు వస్తున్నాయనేది దక్షిణ డిస్కం చెబుతుండగా.. తాము వాడుతున్న కరెంట్‌కే డబ్బులు చెల్లిస్తున్నామని, కొత్తవిధానాలు తీసుకొచ్చి ఆర్థిక భారం మోపుతున్నారంటూ పరిశ్రమల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. కేవీఏఆర్‌హెచ్ విధానానికి సంబంధించి ఇండక్టివ్ రియాక్టివ్ ఎనర్జీ ల్యాగ్, కెపాసిటివ్ రియాక్టివ్ ఎనర్జీ లీడ్ అనే రెండు రకాలుంటాయి. వేర్వేరు సమయాల్లో ఆయా కనెక్షన్లపై పడుతున్న కరెంట్‌లోడ్ ప్రకారం ల్యాగ్, లీడ్ అనే పేర్లతో వీటిని వ్యవహరిస్తుంటారు. ఈ రెండింటినీ కలిపి మీటర్లలో లెక్కించి ఆ కనెక్షన్ పై వాడిన కరెంట్ ఎన్ని యూనిట్లనేది లెక్కించి నెలవారీ బిల్లులు జారీ చేయాలని, కానీ అలా కాకుండా కేవలం ల్యాగ్‌ను మాత్రమే లెక్కించి బిల్లులు ఇచ్చామని, అలా చేయడం వల్ల నష్టాలు వస్తున్నాయని ఈఆర్‌సీకి డిస్కం ఇచ్చిన నివేదికలో పేర్కొంది. దీనివల్ల వాస్తవ ఓల్టేజ్ తేలక విద్యుత్ సరఫరాలో అంతరాయాలేర్పడుతున్నాయంటూ చెప్పారు.

పవర్‌ఫ్యాక్టర్ పేరుతో..!

హెచ్‌టీ కనెక్షన్లలో వాడుతున్న కరెంట్ ఓల్టేజిని తెలిపే పవర్‌ఫ్యాక్టర్ ఎప్పుడూ 0.95 ఉండేలా కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలి. కానీ చాలా కనెక్షన్లలో పీఎఫ్ తక్కువగా నమోదవుతున్నట్లుగా డిస్కం గుర్తించింది. ఇటీవల నగర శివార్లలోని ఒక పరిశ్రమకు సగటు పీఎఫ్ లోడు 0.06 మాత్రమే ఉన్నట్లు గుర్తించిన డిస్కం.. గ్రేటర్ హైదరాబాద్ చుట్టుపక్కల 190 హెచ్‌టీ కనెక్షన్లకు సంబంధించి అదనపు కరెంట్ వినియోగమవుతున్నట్లు గుర్తించింది. ఏ హెచ్‌టీ కనెక్షన్ అయినా రెండు నెలల పాటు పీఎఫ్ 0.95 కన్నా తక్కువ లోడు వినియోగిస్తే తర్వాత మూడు నెలల్లోగా దానిని 0.95 స్థాయికి తెచ్చేలా వినియోగం ఉండాలని ఇందుకోసం కెపాసిటర్లను అమర్చుకోవాలని డిస్కం అధికారులు సూచిస్తున్నారు. మూడునెలల్లోగా ఖచ్చితంగా కెపాసిటర్లు అమర్చుకోవాలని, లేకుంటే వాస్తవ కరెంట్ వినియోగాన్ని గుర్తించి బిల్లులు జారీ చేస్తామంటూ వినియోగదారులకు నోటీసులు ఇచ్చింది.